సాక్షి వికారాబాద్

గురువారం । 14 । నవంబర్ । 2024



ఎంపీని అడ్డుకోవడం..

బాధిత కుటుంబాలను కలిసేందుకు వెళ్తున్న ఎంపీ డీకే అరుణను పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటని బీజేపీ నేతలు అన్నారు. 8లో▸



రైతుల సంక్షేమమే లక్ష్యం

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ దోమ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 9లో▸



కొనసాగుతున్న సర్వే

పెద్దేముల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

క్రీడల్లో గెలుపోటములు సహజం

కలెక్టర్ ప్రతీక్‌జైన్



క్రీడాకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తాచాటాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం వికారాబాద్ పట్టణ పరిధిలోని శివారెడ్డిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల, కళాశాల ఆవరణలో జరుగుతున్న 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలను సందర్శించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పొందవచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు సత్తాచాటి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. క్రీడల్లో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దిశ కమిటీ సభ్యురాలిగా లలిత నియామకం



ఎంపీ కొండా విశ్వేశ్వరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న లలిత

తాండూరు టౌన్: దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ) కమిటీ సభ్యురాలిగా తాండూరు మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ అంతారం లలిత నియమితులయ్యారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి మంజూరవుతున్న నిధులు ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ఏ మేరకు వినియోగిస్తున్నారు అనే విషయమై ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనను దిశ కమిటీ సభ్యురాలిగా నియమించిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు



సుధీర్

అనంతగిరి: గ్రూప్ –3 పరీక్షల నేపథ్యంలో వికారాబాద్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 17, 18 తేదీల్లో జరిగే గ్రూప్ –3 పరీక్షలకు 10,196 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం 31 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షలపై ఏమైనా సందేహాలు ఉంటే నవంబర్ 14 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 8నుంచి రాత్రి 10గంటల వరకు టోల్ ఫ్రీ నంబర్ 084162 35291లో సంప్రదించాలని సూచించారు.

పెళ్లికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

షాద్‌నగర్‌రూరల్: పెళ్లికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దాచి పెట్టిన నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది. పట్టణ సీఐ విజయకుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మమ్మ గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తుంది. భర్త అంజయ్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఆమె నలుగురు కూతుళ్లకు పెళ్లిళ్లు కావడం, భర్త మరణించడంతో గ్రామంలో ఒంటరిగా జీవిస్తుంది. రూ.ఆరు లక్షలు తన కూతురుకు ఇల్లు కట్టుకునేందుకు ఇవ్వాలని ఇంట్లో డబ్బాలో దాచి పెట్టింది. లక్ష్మమ్మ ఈ నెల 9న ఇంటికి తాళంవేసి మండల పరిధిలోని బూర్గుల గ్రామంలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లింది. తిరిగి బుధవారం వచ్చి చూడగా ఇంటి వెనుక భాగంలోని తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు విరగగొట్టిరూ. 6 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని చుట్టు పక్కల వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి వివరాలను సేకరించారు. బాధితురాలు లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

ఫార్మాకు రాజకీయ రంగు

రాజకీయమంతా లగచర్ల ఘటన చుట్టే

- రోజంత పార్టీలు, నేతల హల్‌చల్
- రంగంలోకి మూడు ప్రధాన పార్టీల నేతలు
- ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోస్తూ మీడియా సమావేశాలు
- మరింత వేడిరాజేసిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టు
- నాటకీయ పరిణామాలతో వేడెక్కిన జిల్లా
- ఇరకాటంలో అధికార, ప్రతిపక్షాలు



మన్నెగూడలో ఎంపీ డీకే అరుణను అడ్డుకుంటున్న పోలీసులు

వికారాబాద్: లగచర్ల ఘటనలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బుధవారం అరెస్టులు, ఆందోళనలు, అడ్డగింతలతో జిల్లా అట్టుడికింది. ఫార్మాసిటీ భూ సేకరణలో భాగంగా ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు లగచర్లకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిపై జరిగిన దాడి పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంది. ప్రధాన పార్టీల నేతలు రంగంలోకి దిగి రాజకీయ నాటకాన్ని రక్తి కట్టిస్తున్నారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిల ప్రెస్‌మీట్‌లు, నరేందర్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ బీఆర్‌ఎస్ నేతల పరామర్శలు, రాజకీయ విమర్శలు, బీజేపీ ఎంపీ డీకే అరుణ లగచర్లకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడం వెరసి రోజంతా నేతల రాజకీయ నాటకం రక్తికట్టింది. దీంతో అధికారులపై జరిగిన దాడి అంశం పక్కకు పోయి లగచర్ల ఘటన పూర్తిగా పక్కదారి పట్టింది. మరో వైపు ముందుగా ఊహించినట్లే పోలీసులు కేసును కుట్ర కోణంలో విచారిస్తున్నారు. రిమాండ్ రిపోర్టులో బోగమోని సురేష్ తోపాటు 46మంది పేర్లను చేర్చారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు కొడంగల్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

ఇరకాటంలో అధికార, ప్రతిపక్షాలు

లగచర్ల ఘటన అధికార పార్టీని ఆత్మరక్షణలో పడేయగా.. ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు సెల్ఫ్ గోల్‌గా పరిణమించింది. మరో ప్రధాన పార్టీ బీజేపీ ఫార్మాసిటీ ఏర్పాటుపై ఆచితూచి అడుగులు వేస్తోంది. అధికారులపై దాడి నిఘా వ్యవస్థల వైఫల్యాలను.. రెవెన్యూ, పోలీసు వ్యవస్థల మధ్య సమన్వయ లోపాలను ఎత్తి చూపించింది. దీంతో పాటు లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తడం అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. భూ సేకరణ సున్నితమైన అంశం కావడంతో అధికార పార్టీతోపాటు అధికారులు ఆత్మరక్షణలో పడిపోయారు. ఇక ఫార్మాసిటీ ఏర్పాటు అంశం తెరమీదకు వచ్చింది మొదలు రైతుల తరఫున వాయిస్ వినిపిస్తూ వస్తున్న ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు లగచర్ల ఘటన ఇరకాటంలో పడేసింది. నిందితుడు సురేష్ బీఆర్‌ఎస్ నాయకుడు కావటం, ఆయన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రోద్బలంతోనే అధికారులను గ్రామంలోకి ఆహ్వానించి దాడి చేయించాడని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అధికారులపై తీవ్రస్థాయిలో దాడి జరిగినా బీఆర్‌ఎస్ నేతలు ఖండించక పోవడంపై ఉద్యోగ సంఘాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అధికారులపై జరిగిన దాడిని ఖండించడంతో పాటు కలెక్టర్ సహా ఇతర అధికారులను పరామర్శించారు. ఎంపీ డీకే అరుణ మాత్రం తన కత్తికి రెండు వైపులా పదును పెట్టింది. ఓ పక్క దాడిని ఖండిస్తూనే సీఎంపై తీవ్ర విమర్శలు చేశారు. తాము పరిశ్రమ ఏర్పాటుకు అడ్డు కాదంటూనే రైతుల నుంచి భూములు తీసుకునే పద్ధతి ఇది కాదంటూ చురకలంటించారు. పక్కా ప్లాన్ ప్రకారమే అధికారులపై దాడికి రాళ్లు, కర్రలు, కారం పొడి సిద్ధం చేసుకున్నారని రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. దాడికి ప్రేరేపించిన సురేష్ వెనుక మాజీ ఎమ్మెల్యే ఉన్నారని ప్రాథమిక ఆధారాలు ఉన్నాయంటూ పోలీసులు నరేందర్‌రెడ్డిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారం జిల్లాలో మరింత వేడి రాజేసింది. హైదరాబాద్‌లో నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ముందుగా వికారాబాద్ డీటీసీ(పోలీస్ ట్రైనింగ్ సెంటర్)కు తీసుకువచ్చారు. మధ్యాహ్నం వరకు ఐజీ సత్యానారాయణ ఆధ్వర్యంలో ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్ తమ అనుచరులతో స్టేషన్‌కు చేరుకుని నరేందర్‌రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు సీఎంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇదే సమయంలో ఎంపీ డీకే అరుణ లగచర్ల గ్రామాన్ని సందర్శించేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరగా మన్నెగూడ వద్ద ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. తన నియోజకవర్గంలో పర్యటించకుండా ఎలా ఆపుతారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. కలెక్టర్ అనుమతి తీసుకుని వెళ్లాలంటూ పోలీసులు చెప్పడంతో ఆమె వికారాబాద్‌కు వచ్చి కలెక్టర్‌ను కలిశారు. అంతకుముందు కలెక్టరేట్‌కు వచ్చిన సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి సైతం కలెక్టర్‌ను పరామర్శించారు. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు చేశారు. అనంతరం లగచర్లకు వెళ్లి మీడియాతో మాట్లాడారు. ఇలా రోజంతా జిల్లా రాజకీయం హాట్‌హాట్‌గా సాగింది.

ఎంపీని అడ్డుకున్న పోలీసులు

పూడూరు: వికారాబాద్ వెళ్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను మండలంలోని మన్నెగూడ సమీపంలో పోలీసులు అడ్డుకుని చన్గోముల్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎంపీ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాను కొడంగల్‌కు వెళ్లడం లేదని వికారాబాద్‌లో కలెక్టర్‌ను కలిసేందుకు వెళుతున్నట్లు చెబుతున్నా ఎందుకు వినిపించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా బీజేపీ నాయకులు హైదరాబాద్ – బీజాపూర్ హైవేపై బైఠాయించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఎంపీని వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సొంత నియోజకవర్గంలో తిరిగే హక్కు తనకు లేదా అని ప్రశ్నించారు. సీఎం వల్లే జిల్లాలో లా అండ్ ఆర్డర్ సమస్య వచ్చిందన్నారు. కలెక్టర్‌ను కలిసేందుకు సీఎం అన్నను పంపిస్తారు.. ఎంపీగా నేను వెళ్లకూడదా అని నిలదీశారు.



పరిగి పోలీస్ స్టేషన్ వద్ద భద్రతా ఏర్పాట్లు

పరిగిలో టెన్షన్ టెన్షన్



పట్నం నరేందర్‌రెడ్డిని కొడంగల్ కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

పరిగి: నగరంలో బుధవారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడంతో పరిగిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే పరిగి పోలీస్‌స్టేషన్ చుట్టూ పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. స్టేషన్ చుట్టు పక్కలకు ఎవ్వరినీ అనుమతించ లేదు. మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని వికారాబాద్ నుంచి పరిగి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ రెండు గంటల పాటు విచారించినట్టు సమాచారం. బీఆర్‌ఎస్ నాయకులు రాకుండా పోలీసులు వాహనాల్లో తిరుగుతూ వారి కదలికలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అనంతరం నరేందర్‌రెడ్డిని కొడంగల్ కోర్టుకు తరలించారు.

ప్రతీ గింజ ఖరీదు చేస్తాం



జనగాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంజయ్య

కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య

పెద్దేముల్: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం ఖరీదు చేస్తుందని కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డకింది అంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని జనగాం గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో రెండో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించేందుకు రైతులు ఇబ్బంది పడరాదనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల హామీ మేరకు సన్నరకం వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోరాదని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లయ్య, సీఈఓ లక్ష్మణ్, తట్టేపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా యువ నాయకుడు మైపాల్‌రెడ్డి, తాండూరు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు యాదవ్, నాయకులు డీవై నర్సింలు, విజయకుమార్, రవిశంకర్, మైపూస్, విద్యాసాగర్, బంద్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

పెద్దేముల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని, అలాగే సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ వెంకటరవణ అన్నారు. బుధవారం పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బంది, ఓపీ రిజిస్టర్ తోపాటు మందుల స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో మందుల కొరత లేదని, 170 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వంద శాతం వ్యాక్సినేషన్, ఇమ్యునేషన్ కొనసాగుతుందన్నారు. పాము, కుక్క కాటుకు మందు ఉందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ఎన్ని సబ్‌సెంటర్లు ఉన్నాయి.. సిబ్బంది ఎక్కడి నుంచి విధులకు వస్తున్నారని ఇన్‌చార్జ్ డాక్టర్ బుచ్చిబాబును అడిగారు. మండలంలో మొత్తం 9 సబ్‌సెంటర్లు ఉన్నాయని, తాండూరు నుంచి సిబ్బంది వస్తున్నట్లు డాక్టర్ వివరించారు. సిబ్బంది సక్రమంగా విధులకు రావడం లేదనే ఫిర్యాదులు వచ్చాయని, ఇకపై ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇక్కడ 24 గంటల వైద్య సేవలు అందేవని, ప్రస్తుతం 8గంటలకు కుదించడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని సిబ్బంది డీఎంహెచ్‌ఓకు వివరించారు. పాత పద్ధతిని అమలు చేయాలని కోరారు. స్పందించిన ఆయన ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిత్యం ఓపీకి 120 మంది రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

మంచిపేరు తెండి

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు వచ్చే ఇతర రాష్ట్రాల భక్తులు అనారోగ్య సమస్యలకు గురైతే సత్వర వైద్య సేవలు అందించి మంచి పేరు తీసుకరావాలని డీఎంహెచ్‌ఓ వెంకటరవణ సూచించారు. ధారూరు జాతరలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ జబ్బుతో వచ్చినా మందులు అందుబాటులో ఉండాలన్నారు. సకాలంలో వైద్యం చేయాలని సూచించారు. ఆయన వెంట డ్యూటీ డాక్టర్ శివకుమార్, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



నినాదాలు చేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: పోరాటాల ద్వారానే దళితుల సమస్యలు పరిష్కారం అవుతాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ ఇందిరానగర్ కాలనీలో సమావేశాన్ని బాలాపూర్ మండల దళిత సంఘం అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిల్‌కుమార్‌తో పాటు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల అభ్యున్నతి కోసం పాటు పడటం లేదని విమర్శించారు. దళితులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నారన్నారు. దళితులు ఐక్యతతోనే ముందుకు సాగి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి మల్లేష్, నాయకులు నారాయణ, ఆంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, శివనాయక్, యాదమ్మ, వీరస్వామి, రవి, చిట్టి, మహేష్, సనా పాల్గొన్నారు.

సీఎం గారూ.. బేషజాలకు వెళ్లకండి

- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి
- నరేందర్‌రెడ్డి అరెస్టును ఖండించిన నేతలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి

అనంతగిరి: సీఎం రేవంత్‌రెడ్డి బేషజాలకు పోరాదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి అన్నారు. నగరంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వికారాబాద్‌లోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వారు పార్టీ నాయకులతో కలిసి అక్కడికి చేరుకొని నరేందర్‌రెడ్డితో మాట్లాడారు.

మా హయాంలో రైతులను ఒప్పించాం: మాజీ ఎమ్మెల్యే ఆనంద్

బీఆర్‌ఎస్ హయాంలో రైతులను మెప్పించి, ఒప్పించి భూములు తీసుకున్నామని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. సీఎం నేరుగా రైతులతో మాట్లాడి వారి బాధలు తెలుసుకునే ప్రయత్నం చేసి ఉంటే ఇంత జరిగేది కాదన్నారు. తాము అందుబాటులో లేకుంటే కార్యకర్తలు ఫోన్‌లో మాట్లాడుతుంటారని, అంతమాత్రన కుట్ర చేశామని అనడం సరికాదన్నారు. కార్యకర్తలతో మాట్లాడితే జైలుకు పంపుతారా అని నిలదీశారు. అరెస్టులకు భయపడేది లేదని ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన పట్నం నరేందర్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అరెస్టు అన్యాయం: మహేశ్‌రెడ్డి

అనంతరం మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఫార్మాసిటీని రైతులు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్యాయంగా అరెస్టు చేశారని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులు తమకు ఫోన్ చేయడం సాధారణ విషయమని, అంతమాత్రన అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. మా పాలనలో ఎక్కడా ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. అమాయక రైతులను జైలుకు పంపడం సరికాదన్నారు. రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విరాళాల లెక్క తెలపండి

మంచాల: ఉత్సవాల సందర్భంగా భక్తుల నుంచి వచ్చిన విరాళాల్లో అవకతవకలు జరిగాయని ఆరుట్ల గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు. దీనిపై బుధవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది ఉత్సవాల సందర్భంగా శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి భక్తులు విరాళాలు పెద్ద ఎత్తున నగదు రూపంలో అందాయన్నారు. కొన్నేళ్లుగా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామంలో అన్ని రాజకీయ వర్గాలను కలుపుకొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారన్నారు. ఈ సారి దేవాదాయ శాఖ పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు ఏక పక్షంగా ముందుకు పోతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, డీఎస్పీ నాయకులు రఘుపతి, రాములు, జానిపాషా, జంగయ్య, రాజు, యాదగిరిరెడ్డి, బుచ్చయ్య, రవి, అశోక్, శ్రావణ్‌కుమార్, వంశీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళన



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

కొడంగల్: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు బుధవారం ఆందోళనకు దిగారు. నరేందర్‌రెడ్డికి కొడంగల్ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుట్ర పూరితంగా కేసులు నమోదు చేశారని విమర్శించారు. కొడంగల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ లేకుండా చేయాలనే ఉద్దేశంతో నరేందర్‌రెడ్డిని జైలుకు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేస్తారనే సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ఎంపీని అడ్డుకోవడం సిగ్గుచేటు

- ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దురదృష్టకరం
- బీజేపీ నాయకుల ఆగ్రహం
- లగచర్లకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు



బొంరాస్‌పేట్ పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: లగచర్ల ఘటనలో అక్రమ అరెస్టులను నిరసిస్తూ, బాధిత కుటుంబాలను కలిసేందుకు బయలుదేరిన పలువురు బీజేపీ నాయకులను బొంరాస్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్, సాహు శ్రీలత, భద్రేశ్వర్, బాబయ్య, నర్సింలు, రాములు తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దురదృష్టకరమన్నారు. ఎంపీ డీకే అరుణను అడ్డుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో రైతులను ఇబ్బందికి గురిచేయడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న బీజేపీని అక్రమ అరెస్టులతో అడ్డుకోలేరని హెచ్చరించారు.

ఆర్డీఓను కలిసిన ఏసీపీ



ఆర్డీఓ చంద్రకళకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏసీపీ కిషన్, సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన రెవెన్యూ బదిలీలలో చేవెళ్ల ఆర్డీఓగా వచ్చిన చంద్రకళను ఏసీపీ బి.కిషన్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఆమెను కలిసి స్వాగతం తెలిపారు. అనంతరం చేవెళ్ల డివిజన్ పరిస్థితులపై వారు చర్చించారు. ఏసీపీ కిషన్ వెంట సీఐ భూపాల్‌శ్రీధర్ ఉన్నారు.

దైవచింతన కలిగి ఉండాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కేశంపేట: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని అంజనేయస్వామి దేవాలయంలో జూలై 17 నుంచి బుధవారం వరకు భక్తులు, గ్రామస్తులు చాతుర్మాస్యవ్రత దీక్ష కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ దీక్ష ముగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు దైవచింతన కలిగి ఉండటంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. శ్రీకిషన్‌ప్రభు గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో గీతా పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మళయాళస్వామి ఆశ్రమం నుంచి దయానందస్వామి, మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సజ్జల విశ్వనాథం, నారాయణరెడ్డి, యాదయ్యాచారి, దేవస్థాన కమిటీ చైర్మన్ మఠం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కొత్తూరు: తిమ్మాపూర్ 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు ఏఈ రమేశ్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భయం గుప్పిట్లోనే

- లగచెర్ల, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండా తెరుచుకోని ఇళ్లు
- 16 మంది అనుమానితులకు 14 రోజుల రిమాండ్

దుద్యాల్: వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండల పరిధిలోని లగచెర్ల, పులిచెర్లకుంటతండా, రోటిబండతండాల్లో భయనక పరిస్థితులే పరిస్థితులే కొనసాగుతున్నాయి. అధికారులపై దాడి ఘటన జరిగి రెండు రోజులు గడిచినా ఇక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. సోమవారం దాడి తర్వాత ఆయా గ్రామాలకు చెందిన సుమారు 55 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరందరినీ పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. వీరిలో 39 మందికి ఘటనతో ఏమాత్రం సంబంధం లేదని గుర్తించారు. మిగిలిన 16 మందిని అనుమానితులుగా నిర్ధారించి, మంగళవారం రాత్రి కొడంగల్ న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించారు. మిగిలిన 39మందిని పోలీసులు వారివారి గ్రామాల్లో వదిలేశారు.



సోనిబాయి, రోటిబండ తండా



జ్యోతి, గర్భిణి పులిచెర్లకుంట తండా

వివరాలు తీసుకున్నారు..

దాడిలో పాల్గొనని వ్యక్తులను కూడా పోలీసులు తీసుకెళ్లడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గత సోమవారం రాత్రి గ్రామాలను చుట్టుముట్టిన పోలీసులు అందరూ అనుమానితులే అనే ఉద్దేశంతో కనిపించిన వారినల్లా లాక్కెళ్లారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. ఫార్మాలో తమ భూములు పోతలేవని, ధర్నాలలో పాల్గొనలేదని పోలీసులకు చెప్పామన్నారు. దీంతో పూర్తి వివరాలు తీసుకుని ఎలాంటి షరతులు లేకుండా విడిచిపెట్టారన్నారు. ఇదిలా ఉండగా కేవలం లగచెర్లకు చెందిన వారిని మాత్రమే వదిలేశారని, రోటిబండతండా, పులిచెర్లకుంటతండా గ్రామాల గిరిజన రైతులను ఒక్కరిని కూడా విడిచిపెట్టలేదని ఆయా తండాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వీరంతా భయం నుంచి తేరుకోలేదు.

నాకొడుకు దాడిలో లేడు..

రోటిబండతండాకు చెందిన సోనీబాయికి ఏకైక కొడుకు బాస్యనాయక్‌ను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. సోమవారం జరిగిన ఘటనతో తన కొడుకుకు ఎలాంటి సంబంధం లేదని, ఆరోజు మేకలు తోలుకొని అడవికి వెళ్లాడని ఎంతచెప్పినా పోలీసులు పట్టించుకోలేదని కన్నీరుమున్నీరవుతోంది. తనకు కళ్లు కనిపించవని, వండుకునే పరిస్థితి కూడా లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంచేసింది. దాడిలో పాల్గొనని తన కొడుకును విడిచిపెట్టాలని రోదించింది.

డెలివరీ సమయమని చెప్పినా వినలేదు

పులిచెర్లకుంటతండాకు చెందిన ప్రవీణ్, జ్యోతి దంపతులు. ప్రస్తుతం జ్యోతి నిండు గర్భిణి. పోలీసులు వచ్చి తన భర్తను తీసుకెళ్తుండగా.. తనకు డెలివరీ సమయం ఉందని కాళ్లు మొక్కినా పట్టించుకోలేదని వాపోయింది. తాను ఆస్పత్రికి వెళ్లాలని, రెండు రోజులుగా నిద్రాహారాలు లేవని కన్నీరు కార్చింది. ఇంట్లో ఒంటరిగా ఉండలేకపోతున్నాని వెంటనే తన భర్తను వదిలేయాని కోరింది.

డీలక్స్ నిల్.. ఎక్స్‌ప్రెస్ ఫుల్!



తుంకిమెట్ల వద్ద ఖాళీగా ఉన్న డిలక్స్‌బస్సు



మహిళా ప్రయాణికులతో ఎక్స్‌ప్రెస్ బస్

- 'ఉచిత బస్'తో నిత్యం తంటాలు
- బస్సుల సంఖ్య పెంచాలని వేడుకోలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

బొంరాస్‌పేట: ప్రభుత్వం మహిళలకు కల్పించిన 'ఉచిత బస్ ప్రయాణం'తో నిత్యం ఆర్టీసీ సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికులు మాత్రం సీట్లకోసం కుస్తీ పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొడంగల్ ప్రాంతానికి నిత్యం సరిపడ ఆర్డినరి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అన్ని చోట్ల ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు జీరో టికెట్ పట్ల కొందరు అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. కాగా ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో పరిగి, కోస్గి, తాండూరు, నారాయణపేట డిపోల మేనేజర్లు చేపట్టిన ప్రయోగాత్మక డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌ల రాకపోకలు ఆశాజనకంగా లేవని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. కొందరు ప్రయాణికులు డీలక్స్ బస్సులో డబ్బులు పెట్టలేకపోతున్నారు. మరికొంతమంది ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఫుల్‌గా ఉండడంతో తంటాలు పడి అదే బస్సును ఎక్కాల్సిన పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. దీంతో డీలక్స్‌లు నిల్.. ఎక్స్‌ప్రెస్ ఫుల్ అని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'నరేందర్‌రెడి అరెస్టు అక్రమం'

బంట్వారం: కొంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు అక్రమమని కోట్‌పల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ ఉప్పరి మహేందర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు తమ సమస్యను వినిపించేందుకు నరేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడితే కుట్రకోణం ఉందని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేకతను దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులను టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదిశగా ప్రభుత్వం దృష్టిసారించాలని సూచించారు.

అరెస్టులు అప్రజాస్వామికం

- బీఆర్‌ఎస్ నేతల మండిపాటు
- నరేందర్‌రెడ్డితో పాటు రైతులను విడుదల చేయాలని డిమాండ్

మొయినాబాద్: రైతుల పక్షాన మాట్లాడితే అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నాయకులు రైతుల పక్షాన మాట్లాడితే అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ఫార్మాకంపెనీకోసం చేపడుతున్న భూసేకరణను రైతులు వ్యతిరేకిస్తున్నారని.. రైతులు, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను గుర్తించని ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. అందుకే ప్రజలు తిరగబడుతున్నారన్నారు. అక్రమ అరెస్టులతో బీఆర్‌ఎస్ శ్రేణులను భయపెట్టాలని చూస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ తరఫున రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితోపాటు ఇతర నాయకులు, రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తిరుపతిరెడ్డిపై ప్రొటోకాల్ వివాదం

కలెక్టర్ ఎదురొచ్చి లోనికి తీసుకెళ్లడంపై దుమారం

వికారాబాద్: గతంలో పలు సంబదర్భాల్లో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ప్రొటోకాల్ వివాదం తెరపైకి రాగా తాజాగా మరోసారి ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. బుధవారం తిరుపతిరెడ్డి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితోపాటు పెద్ద సంఖ్యలో అనుచరులతో కలిసి వికారాబాద్ కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎదురువెళ్లి ఆయన్ను కలక్టరేట్‌లోని తన చాంబర్‌కు తీసుకెళ్లాడు. దీంతో దుమారం మొదలయ్యింది. ఆ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారటంతో వివాదస్పదంగా మారింది. ఆయనకు ఏ హోదా ఉందని కలెక్టర్ తన పరివారంతో వచ్చి స్వాగతం పలికి తీసుకువెళ్తున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన ఎంపీ డీకే అరుణ సైతం మీడియా ముఖంగా ప్రశ్నించారు. సీఎం సోదురుడు అయినంత మాత్రానా అధికారులు, పోలీసులు ప్రొటోకాల్ పాటిస్తారా? ఆయన కనీసం వార్డు మెంబర్ కూడా కాదు కదా?! అలాంటిది ఎందుకు స్వాగతం పలుకుతున్నారు? ఆయనకు ఎందుకు పోలీసులు ఎస్కార్ట్ ఇచ్చి పంపిస్తారు. తాము నియెజకవర్గ పర్యటనకు వెళతామంటే 144 సెక్షన్ అమలులో ఉందని నిలువరిస్తారు. వందల మందిని వెంట తీస్కోని వెళుతున్న సీఎం సోదరుడికి ఇవేవి వర్తించవా? అని ఆమె ప్రశ్నించారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

అనంతగిరి: యువత మాదక ద్రవ్యాల జోలికెళ్లొదని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. బుధవారం వికారాబాద్ సమీపంలోని అనంతగిరిగుట్టలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం డీఎంహెచ్‌ఓ, కమ్యునిటీ మెడిసిన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు పొగాకు, పొగాకు ఉత్పత్తులు, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులతో ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలయ్యాయన్నారు. మాదకద్రవ్యాల జోలికి వెళితే జీవితం నాశనం అవుతాయన్నారు. డ్రగ్స్‌ను నిరోధించడంలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్‌సీడీ కోఆర్డినేటర్లు రేణుకుమార్, జయరాం, రజిత, మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ పద్మమాలిని, అనిత, భవానీ పాల్గొన్నారు.

జాతరలో ప్రారంభమైన ప్రార్థనలు



ఏసుక్రీస్తు సందేశాన్ని వింటున్న భక్తులు

రెండోరోజు కొనసాగిన ఉత్సవాలు

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు ఇతర జిల్లాల నుంచి ఏసుక్రీస్తు భక్తుల రాక ప్రారంభమైంది. బుధవారం రెండోరోజు ప్రార్థనలు కూడా నిర్వహించారు. ఏసు సందేశాన్ని ఆలకించడానికి భక్తులు ఆడిటోరియానికి చేరుకుని పాటలు పాడుతూ, భజనలు చేస్తూ ఏసుక్రీస్తును స్తుతించారు. జాతర ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 24 గంటల పాటు వైద్య సేవలు అందించేందుకు నిర్వాహకులు సిబ్బందిని ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా కొన్ని చోట్ల వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. పెద్ద మొత్తంలో దుకాణాల ఏర్పాటు, ప్రత్యేకంగా పోలీస్ కంట్రోల్ రూంను అధికారులు ఏర్పాటు చేశారు.



జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాలు

ఇరకాటంలో మహేందర్‌రెడ్డి



మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

- సోదరుడి అరెస్టుతో అయోమయంలో పట్నం అనుచరులు
- నోరుమెదపని మండలి చీఫ్‌విప్
- లగచర్ల దాడి మొదలు అంతా గప్‌చుప్
- అటు సోదరుడు.. ఇటు పార్టీ
- అడకత్తెరలో పోక చెక్కలా పరిస్థితి

వికారాబాద్: సీఎం సొంత నియోజకవర్గం దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో అధికారులపై జరిగిన దాడి శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డిని ఇరకాటంలో పడేసింది. ఘటన జరిగింది మొదలు నోరు మెదపకుండా సైలెంట్‌గా ఉంటూ వస్తున్న ఆయనకు సొంత సోదరుడు నరేందర్‌రెడ్డి అరెస్టు వ్యవహారం మరింత అయోమయంలో పడేసింది. అధికారులపై దాడి ఘటనపై గానీ ఇటు నరేందర్‌రెడ్డి పాత్రపైగానీ మహేందర్‌రెడ్డి నోరు మెదపలేని పరిస్థితి తలెత్తింది. ఇటు సొంత పార్టీ కాంగ్రెస్.. అటు సొంత సోదరుడు నరేందర్‌రెడ్డి కావటంతో ఇప్పుడు ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. లగచర్లలో కలెక్టర్ సహా అధికారులపై దాడి జరిగింది మొదలు అటు ప్రతిపక్ష పార్టీల నేతలు.. ఇటు సొంత పార్టీ నేతలు స్పందిస్తూనే ఉన్నారు. అధికార పార్టీకి చెందిన జిల్లా ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి పరామర్శించారు. దాడిని ఖండించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సైతం అధికారులకు బాసటగా మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల నేతలు ఘటనపై స్పందించారు. ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. కానీ పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు మాత్రం ఇప్పటి వరకు నోరు విప్పలేదు.

అటు సోదరుడు.. ఇటు పార్టీ

రాజకీయ ఆరంగేట్రం చేసింది మొదలు పట్నం సోదరులు మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఒకే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. ముందుగా టీడీపీలో ఆ తరువాత బీఆర్‌ఎస్‌లో అనేక పదవులు చేపట్టినప్పటికీ ఇద్దరు ఒకే పార్టీలో ఉంటూ రావటంతో ఇలాంటి ఇరకాట పరిస్థితి ఎప్పుడూ తలెత్తలేదు. తాజాగా 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాలో మరియు ముఖ్యంగా తాండూరు నియోజకవర్గంలో చోటు చేసుకున్న పరిణామాలు పట్నం సోదరులిద్దరిని విడదీశాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పార్లమెంట్ ఎన్నికలకు ముందు పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. అనంతరం మహేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ శాసన మండలి చీఫ్‌విప్ పదవిని కట్టబెట్టగా ప్రస్తుతం ఆయన ఆ హోదాలో కొనసాగుతున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం ప్రత్యర్థిగా కొడంగల్‌లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మరియు అతని పెద్ద సోదరుడు రాజేందర్‌రెడ్డి కుమారుడు అయిన అవినాశ్‌రెడ్డిలు బీఆర్‌ఎస్‌లోనే ఉండిపోయారు. దీంతో పట్నం కుటుంబసభ్యులు సగం కాంగ్రెస్‌లో మరో సగం బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ వస్తున్నారు. అయితే ఇన్నాళ్లు అంతా సవ్యంగానే నడిచినా లగచర్ల ఘటనతో పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు పూర్తిగా ఇరకాటంలో పడిపోయారు. అటూ సోదరుడు నరేందర్‌రెడ్డి అరెస్టును ఖండించ లేదు.. ఇటు పార్టీ విధానాల మేరకు అధికారులపై జరిగిన దాడిని కూడా ఖండించలేని పరిస్థితి నెలకొంది.

మొరాయించిన టిప్పర్.. భారీగా ట్రాఫిక్ జామ్



తాండూరు బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు, వాహనదారులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ప్లైఓవర్ బ్రిడ్జిపై టిప్పర్ మొరాయించడంతో బుధవారం సాయంత్రం ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో తాండూరు, కొడంగల్ రహదారిలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఇరుకుగా ఉన్న బ్రిడ్జిపై వాహనాలు ఎదురెదురుగా రావడంతో అవి ఎటూ కదలలేక పోయాయి. దీంతో సుమారు రెండు గంటలకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను ఒక్కొక్కటిగా సరిచేసి పంపించేశారు. తరచూ ఇలా జరగడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

కొత్తూరు: మండల పరిధిలోని మల్లాపూర్‌తండా పంచాయతీ రాగ్యతండాలో నూతనంగా నిర్మించిన లలితాంబికదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని పలువురు నాయకులతో కలిసి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్‌నాయక్, హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, రవినాయ క్, దశరత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పూజలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అమ్మవారి జాతరకు వేళాయె

- ఈ నెల 15 నుంచి మైసిగండి మైసమ్మ వార్షికోత్సవాలు
- ఏటా కార్తీక పౌర్ణమికి జాతర ప్రారంభం
- ఆరు రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కడ్తాల్: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మండలంలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ తల్లి వార్షికోత్సవాలు ఈ నెల 15న(శుక్రవారం) నుంచి ప్రారంభంకానున్నాయి. జాతర 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా కొనసాగనుంది. ఏటా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జరిగే మైసమ్మ జాతరకు జిల్లా నుంచే కాకుండా మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మేడ్చల్, నల్గొండ, హైదరాబాద్, మెదక్ తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై మైసిగండి ఆలయం ఉండటంతో నిత్యం అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూకడతారు. ప్రత్యేకించి ఆది, మంగళ, గురువారాల్లో వేల సంఖ్యలో దర్శనానికి వస్తూ మొక్కులు చెల్లించుకుంటారు. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ట్రస్టీ శిరోలీపంతునాయక్, ఈఓ స్నేహలత పేర్కొన్నారు.



మైసిగండి మైసమ్మ ఆలయ ప్రాంగణం

నిర్వహించే కార్యక్రమాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 15న అమ్మవారికి క్షీరాభిషేకం, విశేష అలంకరణ, కుంభహారతి, 16న విశేష పూజలు రాత్రికి పుష్పరథోత్సవం, చిన్న తేరు ఊరేగింపు ఉంటుందన్నారు. 17న విశేషపూజలు, అమ్మవారి పెద్ద రథోత్సవం, 18న అమ్మవారి బోనాలు, బండ్లు తిప్పుట, 19న శతచండీ హోమం, విశేషపూజలు, కార్తీక దీపోత్సవం, 20న అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరణ, అన్నదాన కార్యక్రమాలతో ఉత్సవాలు వైభవంగా ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రవాణా సదుపాయం

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మైసిగండి మైసమ్మ ఆలయం ఉంది. నగరం నుంచి 48 కిలోమీటర్ల దూరంలో మైసిగండి క్షేత్రం కొలువైయుంది. ఇమ్లీబన్ బస్టాండ్ నుంచి ప్రతి ఐదు నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు. అదే విధంగా నల్గొండ ఎక్స్ రోడ్, ఐఎస్ సదన్, సంతోష్‌నగర్, చంద్రయాన్‌గుట్ట నుంచి ప్రతి ఐదు నిమిషాలకు బస్సులున్నాయి. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట్ నుంచి కూడా బస్సు సౌకర్యం కలదు.



కొలువైన మైసమ్మ తల్లి

ప్రత్యేక ఏర్పాట్లు



మైసిగండి మైసమ్మ జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అదే విధంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయిస్తున్నాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక వసతి, సౌకర్యాలు తదితర ఏర్పాట్లు చేపట్టాం.

– శిరోలి పంతునాయక్, ఆలయ ట్రస్టీ

ఇబ్బందులు కలగకుండా చర్యలు



ఆలయంలో ఆరు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నాం. పోలీసుల సహకారాన్ని తీసుకుంటున్నాం.

–స్నేహలత, ఈఓ